


షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152




సంపుటి : 3 సంచిక : 123 శనివారం 09 మే 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.


## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన..



## ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!

ఎల్లుండి హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 08)

ఎల్లుండి (మే 10) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్‌లో ▶2లో

## బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి.. రేపే ప్రమాణస్వీకారం



పశ్చిమ బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 08)

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభమైంది. రాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో శుక్రవారం జరిగిన బీజేపీ నూతన ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా... ▶2లో

## ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

ఏపీ ఈసెట్ 2026 ఫలితాలు విడుదల
మొత్తం 91.72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత
ఫలితాలను 'ఎక్స్' వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్‌లోనూ ర్యాంకు కార్డుల వెల్లడి
బీటెక్ సెకండియర్‌లోకి లేటరల్ ఎంట్రీ కోసం ఈ పరీక్ష



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 08)

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఈ ఫలితాలను 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షలో మొత్తం 91.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఆయన వెల్లడించారు.

ఈ ఏడాది ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ▶2లో

## పాలనలో ఆ రెండు చాలా ముఖ్యం



- కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు
- 7వ జిల్లా కలెక్టర్ల సమావేశం
- పాలనలో టెక్నాలజీ, మానవీయత రెండూ ముఖ్యమన్న సీఎం చంద్రబాబు
- ప్రతీ శుక్రవారం నియోజకవర్గాల్లో 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహణ
- ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- అర్జీల పరిష్కారంలో ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తెచ్చుకోవాలని సూచన
- 90 రోజుల్లో అన్ని శాఖల కేపీఐలతో డ్యాష్ బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 08)

"పాలనలో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో మానవీయ కోణంతో ఆలోచించి ప్రజలకు సేవలు అందించడం కూడా అంతే ముఖ్యం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం సాంకేతికతపైనే ఆధారపడి యాంత్రికంగా కాకుండా, ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వారి పట్ల కరుణతో స్పందించాలని అధికారులకు ఆయన హితవు పలికారు. శుక్రవారం జరిగిన 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెండో రోజు ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పాలనా వ్యవస్థలో వేగం, పారదర్శకతతో పాటు మానవతా విలువలకు పెద్దపీట వేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఫైళ్ల క్లియరెన్స్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం (పీజీఆర్ఎస్), టెక్నాలజీ వినియోగం వంటి పలు కీలక అంశాలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు.

**అర్జీల పరిష్కారంలో బ్రాండ్ ఇమేజ్ రావాలి**

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రం ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొందరు అధికారులు అర్జీలను తీసుకుని కార్లలో పడేస్తున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, ఇలాంటి అలసత్వం పునరావృతం కావొద్దని గట్టిగా హెచ్చరించారు. ▶2లో

## ఈ-ఫైళ్ల పరిష్కారంలో అచ్చెన్నాయుడు నెంబర్ వన్

పాలనలో సాంకేతికతను జోడిస్తున్న ఏపీ ప్రభుత్వం
ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం
అచ్చెన్నాయుడి పనితనాన్ని ప్రశంసించిన చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 08)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలనలో సాంకేతికతను జోడించి, ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగాన్ని పెంచడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈ-ఫైళ్ల పరిష్కారంలో చూపిన చొరవ ఒక సరికొత్త రికార్డుకు దారితీసింది.

గతంలో ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌కు సగటున 5 గంటల సమయం పట్టేది. అయితే, మంత్రి అచ్చెన్నాయుడు తన శాఖకు సంబంధించిన ఫైళ్లను అత్యంత వేగంగా పరిశీలించి, ఆ సమయాన్ని 2 గంటల 49 నిమిషాలకు తగ్గించారు. పరిపాలనలో జాప్యాన్ని తగ్గించి, ప్రజలకు త్వరితగతిన సేవలు అందించడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్న తీరును కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు.

ప్రభుత్వ యంత్రాంగంలో ఈ-ఫైళ్ల విధానం అమలులోకి రావడం వల్ల ఫైళ్లు ఎక్కడ ఆగిపోయాయో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వీలుంటుంది. అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ శాఖ ఈ సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటూ ముందంజలో ఉందని అధికారులు చెబుతున్నారు. రోజుల తరబడి పెండింగ్‌లో ఉండే ఫైళ్లు ఇప్పుడు గంటల వ్యవధిలోనే పరిష్కారం కావడం అనేది పాలనలో పారదర్శకతకు నిదర్శనం. ▶2లో

## అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు...




విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం
జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావలా వడ్డీకే రుణాలు
కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు
ఆగస్టు 15 నాటికి 2.5 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు
బుడగజంగాలకు ఎస్సీలకు వర్తించే అన్ని ప్రయోజనాలు వర్తింపు
సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాల అమలుపై సీఎం సమీక్ష

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 08)

ఆంధ్రప్రదేశ్‌లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వీలుగా పావలా వడ్డీ (25 పైసల వడ్డీ)కే విద్యా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఏడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా సంక్షేమ పథకాలపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో ఐఐటీ, ఐఐఎం, -మిగతా ▶2లో



## చుక్కల భూములపై త్వరలో సానుకూల నిర్ణయం

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 08)

చుక్కల భూములపై రైతులకు హక్కులు కల్పించే విషయమై త్వరలో సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. అన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ▶2లో

## టీవీకే విజయం వెనుక జగన్ ఫొటో ఉందనే ప్రచారంపై సత్యకుమార్ విమర్శలు

విజయ్‌ని గవర్నర్ ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారంలో నిజం లేదన్న సత్యకుమార్
జగన్ పాలనను ఏపీ ప్రజలే తిరస్కరించారని ఎద్దేవా
రోజా ఎక్కడ ప్రచారం చేస్తే అక్కడ ఓటమి తప్పదని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 08)

తమిళనాడు రాజకీయ పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గవర్నర్ వ్యవస్థపై స్పందించారు. తమిళనాడులో టీవీకే అధినేత ▶2లో

## టారిఫ్‌ల విషయంలో.. ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 08)

టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచ దేశాలపై ఆయన విధించిన 10 శాతం సుంకాలు చట్టవిరుద్ధమని పేర్కొంటూ.. అమెరికా



న్యాయస్థానం వాటిని కొట్టివేసింది. ఈ మేరకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం 2-1 తేడాతో తీర్పునిచ్చింది. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవని అమెరికా సుప్రీంకోర్టు ఫిబ్రవరిలో సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ట్రంప్ యంత్రాంగం ప్రపంచ దేశాలపై మళ్లీ 10 శాతం తాత్కాలిక టారిఫ్‌లను విధించారు. ▶2లో

# బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి.. రేపే ప్రమాణస్వీకారం

బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించి, 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. మొత్తం 294 స్థానాలకు గాను 207 సీట్లు గెలుచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఈ నేపథ్యంలో శాసనసభాపక్ష నేత ఎన్నిక కోసం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సహ పరిశీలకునిగా వ్యవహరించారు.ఈ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలుపొందారు. ముఖ్యంగా భవానీపూర్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై 15 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం ఆయనకు కలిసొచ్చింది.మే 9న కోల్‌కతాలోని ప్రసిద్ధ బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. సువేందు అధికారి ఎన్నికతో రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

# టారిఫ్‌ల విషయంలో.. ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ

ఇవి జులై 24తో ముగియనున్నాయి. ఈ క్రమంలో సుంకాలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ.. 24 అమెరికా రాష్ట్రాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై తాజాగా విచారణ జరిపిన ఒక ఫెడరల్ కోర్టు.. అధ్యక్షుడికి కాంగ్రెస్ కల్పించిన సుంకాల అధికార పరిధిని ట్రంప్ అతిక్రమించారని పేర్కొంది. ట్రంప్ విధించిన సుంకాలు చట్టవిరుద్ధమని.. దీంతో అవి చెల్లవని తీర్పునిచ్చింది. అయితే, ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి ఈ తీర్పును విభేదించారు. సుంకాల విషయంలో చట్టం అధ్యక్షుడికి విస్తృతమైన అధికారం కల్పించిందన్నారు.

# పాలనలో ఆ రెండు చాలా ముఖ్యం

"ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి. కాగితాలు తీసుకుని పక్కన పడేయడం కాదు, సమస్య పరిష్కారమైతేనే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది" అని అన్నారు. ఇందుకు అనుగుణంగా 'ప్రజా దర్బార్' వంటి ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సింగపూర్ తరహాలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి కూర్చుని అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. దీనిలో భాగంగా, ప్రతి సోమవారం కలెక్టరేట్లలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే మాదిరిగానే, ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్లు 'గుడ్ విల్ మిషన్' గా క్షేత్రస్థాయికి వెళ్లి, ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని నాలుగు సార్లు సందర్శించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**ఫైళ్ల క్లియరెన్స్‌లో సత్వర స్పందన**

ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా అందాలంటే ఫైళ్ల క్లియరెన్స్ అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. గత మూడు నెలలతో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఫైళ్ల క్లియరెన్స్ సగటు సమయం 10 రోజుల నుంచి 2 రోజులకు తగ్గడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దమొత్తంలో ఫైళ్లు వచ్చినా, సగటున 10 గంటల వ్యవధిలోనే డిస్పోజ్ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు, ఎస్పీలు కొనసాగించాలని, 24 గంటల్లోపు ఇ-ఫైల్స్ పరిష్కరించేలా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.

పనితీరులో వెనుకబడిన అధికారులు వేగం పెంచుకోవాలని స్పష్టం చేశారు. ఇకపై మాన్యువల్ ఫైళ్లకు స్వస్తి పలికి, జిల్లా స్థాయి నుంచి హెచ్‌ఓడీల వరకు తప్పనిసరిగా ఇ-ఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలని ఆదేశించారు.

**ఆన్‌లైన్ సేవలతో అవినీతికి చెక్**

ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని వృధా చేసుకోకూడదని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమయం ఆదా అవ్వడంతో పాటు, అవినీతికి కూడా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. 'వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర' ద్వారా ఇప్పటికే 29 లక్షల మందికి శిక్షణ ఇచ్చామని, డిసెంబరు నాటికి 100 శాతం ప్రభుత్వ సేవలను

మొదటిపేజీ తరువాయి

వాట్సాప్‌లో అందించేలా చూడాలని లక్ష్యం నిర్దేశించారు. స్మార్ట్ ఫోన్లు లేని 34 శాతం కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని, మాన్యువల్ టచ్ పాయింట్ల వద్ద వారికి వాట్సాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. తుపాను, పిడుగుల వంటి ప్రకృతి వైపరీత్యాల హెచ్చరికలను నేరుగా ప్రజల మొబైళ్లకే పంపే వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు.ఈ సమీక్షలో భాగంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును, రోజువారీ లక్ష్యాలను ఒకే వేదికపై పర్యవేక్షించేందుకు వీలుగా ఒక సమగ్ర డ్యాష్‌బోర్డును రూపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే 90 రోజుల్లో ఈ డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెస్తామని సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన.. ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!

పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు.బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రేపు అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్‌లు, పారాగ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది.ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ఎవం.ఖజూంఎష్ట్రవ.ఖజూ.స్త్రశీజ.అఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు.

ఫలితాల విడుదల ప్రక్రియ పూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

# ఈ-ఫైళ్ల పరిష్కారంలో అచ్చెన్నాయుడు నెంబర్ వన్

ఒక మంత్రి స్థాయిలో ఫైళ్లు ఇంత వేగంగా క్లియర్ అవ్వడం వల్ల కింది స్థాయి అధికారులపై కూడా సానుకూల ప్రభావం పెరుగుతుంది. రైతులకు సంబంధించిన పథకాలు, రాయితీలు లేదా ఇతర అనుమతులు త్వరగా మంజూరు కావడానికి ఈ వేగం ఎంతగానో దోహదపడుతుంది.

# టీవీకే విజయం వెనుక జగన్ ఫొటో ఉందనే ప్రచారంపై సత్యకుమార్ విమర్శలు

విజయ్‌ని ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించే విషయంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అనుసరిస్తున్న తీరుపై వస్తున్న విమర్శలను మంత్రి తిప్పికొట్టారు. గవర్నర్ విజయ్‌ని ఇబ్బంది పెడుతున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని, ఆయన పూర్తిగా రాజ్యాంగ నిబంధనలకు లోబడే నిర్ణయాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తులు నిబంధనల ప్రకారమే నడుచుకుంటారని ఆయన పునరుద్ఘాటించారు.తమిళనాడు ఎన్నికల్లో విజయ్ సాధించిన విజయం వెనుక జగన్ ఫొటో ఉందంటూ వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాన్ని మంత్రి హాస్యాస్పదంగా అభివర్ణించారు. సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రజలే జగన్ పాలనను తిరస్కరించి 11 సీట్లకు పరిమితం చేశారని, అలాంటిది పొరుగు రాష్ట్రంలో ఆయన ప్రభావం ఉంటుందనుకోవడం భ్రమ అని ఎద్దేవా చేశారు. "బోర్డర్ దాటితే జగన్‌ను ఎవరైనా గుర్తుపడతారా?" అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.తమిళనాడు ఎన్నికల్లో మాజీ మంత్రి రోజా డీఎంకే తరఫున ప్రచారం చేసిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆమె ఎక్కడ ప్రచారం చేస్తే అక్కడ ఓటమి ఖాయమని, డీఎంకే పరాజయం పాలవ్వడమే దీనికి నిదర్శనమని విమర్శించారు. ఏపీలో ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీ నేతలు ఇంకా తమ తీరు మార్చుకోలేదని ఆయన మండిపడ్డారు.

# చుక్కల భూములపై త్వరలో సానుకూల నిర్ణయం

ఏర్పాటుతోపాటు.. రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖలను అనుసంధానిస్తూ ఒకే ప్లాట్‌ఫాంపైకి తీసుకురాబోతున్నామని కలెక్టర్ల సదస్సులో చెప్పారు. 'రైతులే తమ భూపత్రాల్ని ఆన్‌లైన్‌లో లాక్ చేసుకునే విధానం తెచ్చాం. ఈకేవైసీ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలిస్తున్నాం. ఇళ్ల పట్టాలిచ్చాక రెండేళ్లకే హక్కులు కల్పిస్తున్నా. పట్టణ గరిష్ఠ భూపరిమితి చట్టం కింద నిషేధిత జాబితాలోని స్థలాల క్రమబద్ధీకరణ గడువు తేదీని డిసెంబరు 31 వరకు పొడిగిస్తున్నాం. 1.36 లక్షల విలేజి సర్వీస్ ఇనాం భూముల్ని, 33,440 ఎకరాల షరతుగల పట్టా భూముల్ని 22ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించాం' అని తెలిపారు. అనంతరం సింగపూర్ పర్యటనలో తెలుసుకున్న విషయాల్ని వివరించారు.

**నిధుల్ని సమర్థంగా ఖర్చు చేయాలి**
**ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్**

'మన వనరులు పరిమితం. వాటిని సమర్థవంతంగా ఖర్చు చేయాలి' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. 'ఆర్థికపరమైన సవాళ్లను అధిగమిస్తూ ఏపీ ముందుకు వెళ్తోంది. వృథా ఖర్చులు తగ్గించుకుని అభివృద్ధికి పనిచేయాలి. ప్రజలకు ఫలితాలు చూపాలి. ఒక శాఖలో రూ.96 వేల కోట్ల ఒప్పందాలు ఉన్నాయి. అందులో సీఎం సూచించిన ప్రాధాన్యం మేరకు పనులు చేయాలి. బడ్జెట్ పరిధిలోనే ప్రతిపాదనలు పంపాలి' అని సూచించారు.

# అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు...

ఎన్ఐటీ వంటి జాతీయ సంస్థలతో పాటు విదేశాల్లోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో చదవాలనే విద్యార్థుల కలలు సాకారం కానున్నాయి.కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రఖ్యాత సంస్థల్లో సీట్లు సాధించేలా చూడాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

**సంక్షేమ పథకాలపై సమీక్ష, కీలక ఆదేశాలు**

సూపర్ సిక్స్ పథకాల అమలు, లబ్ధిదారుల ఇంటిగ్రేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు విస్తృతంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు అందిస్తున్నామని, 'స్త్రీశక్తి' పథకం కింద మహిళలు ఇప్పటివరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారని, దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.1940 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. 'దీపం 2.0' కింద 1.08 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.3504 కోట్లు అందజేశామన్నారు. మే 19న మత్స్యకారుల కోసం రూ.286 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

**బుడగజంగాలకు ఎస్సీ ప్రయోజనాలు**

సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. బుడగజంగాలను ఎస్సీలలో చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్రంతో చర్చిస్తామని, కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తించే అన్ని సంక్షేమ ప్రయోజనాలను వారికి వర్తింపజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇది వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది.

**పేదల సొంతింటి కల సాకారం**

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని సీఎం తెలిపారు. ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని, దీనివల్ల ఒక్క విజయవాడలోనే 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు.

**పరిపాలనలో పారదర్శకత, వేగం**

ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు పనిచేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చులు తగ్గించేలా చొరవ చూపాలన్నారు. భూవివాదాలను పరిష్కరించడంలో భాగంగా వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి 22ఏ కింద ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 2027 మార్చి నాటికి భూ రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల సమావేశాలు, సమీక్షలు కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని, ప్రతి అధికారి ఈ విషయాన్ని గుర్తుంచుకుని పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.



# జవహర్ నవోదయ విద్యాలయంలో సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందనలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 8)

జవహర్ నవోదయ విద్యాలయంలో సీట్లు సాధించిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్ రాహుల్, పి మంజులను డిప్యూటీ డిఈఓ ఎం శ్రీనివాసులు అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి కరీమూన్ బీబీ, ఉపాధ్యాయులు రామయ్య, రమణయ్య, రంగనాయకులు, కోటేశ్వరరావు, అహ్మద్, జాఫర్, జిలానీ, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి జవహర్ నవోదయ విద్యాలయంలో సీట్లు సాధించడం గర్వకారణమని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో కూడా జరుగుతున్నందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలని కోరారు.


# శ్రీగిరిలో శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)

శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను పద్యాలను గానం చేసారు. గాయని ఫణిదీప్తి అన్నమయ్య సంకీర్తనలను మృదు మధురంగా ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ప్రతి ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్‌లో చిన్మయ మిషన్ తోడ్పాటుతో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులలో పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.


ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
09.05.26 శనివారం


# 9, 10న జరిగే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)
ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలు నగరంలోని సాయి ఐటిఏ కన్వెన్షన్ హాల్లో ఈ నెల 9, 10 తేదీల్లో జరుగుతున్నాయని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, రవి కుమార్ లు తెలిపారు. కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కోపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏర్పడి 60 సంవత్సరాలు అయిందని వజ్రోత్సవ ముగింపు వేడుకలు కూడా ఇక్కడే జరుగుతున్నాయని తెలిపారు. 9, 10 తేదీలలో రెండు రోజుల పాటు యూనియన్ యొక్క నిర్మాణ సమీక్షతో పాటుగా సహకార రంగంలో రెండించల విధానాన్ని అమలు చేయాలని తీర్మానాలు చేయబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు, మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి,స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు,
ఆహ్వాన కమిటీ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జిల్లాలోని ప్రజాప్రతినిధులు రాష్ట్ర నలుమూలల నుంచి సహకార రంగ ఉద్యోగులు పాల్గొంటారని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో అసోసియేషన్ సభ్యులు లోకనాథం, ఎస్కె సుభాని, రావులపల్లి గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.



2 లో

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ మాగుంట

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)
గృహ, పట్టణ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ స్టడీ టూర్‌లో భాగంగా శుక్రవారం ఉదయం తిరుపతిలో కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి జిల్లా, తిరుపతి నగరపాలక సంస్థ, టిటిడి దేవస్థానం, హడ్కో, యన్‌బిసిసి, సిపిడబ్ల్యుడి, యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు తదితర సంస్థల ప్రతినిధులతో అమృత్, అమృత్ 2, స్వచ్ఛ్ భారత్ మిషన్, అర్బన్, పియంఏవై 2.0, పియంఎస్‌విఏ నిధి, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, నేషనల్ అర్బన్ డిజిటల్ మిషన్, పియం ఈ బస్ సేవ, తిరుపతి జిల్లాలో ఐసిసిసిల పనితీరు, సిపిడబ్ల్యుడి, యన్‌బిసిసి, హడ్కో పనితీరు పై సమీక్ష, తిరుపతి నగరపాలక సంస్థ ఆర్థిక నిర్వహణ, వారసత్వ, మతపరమైన తిరుపతి పట్టాన సుస్థిర అభివృద్ధి పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిటీ సభ్యులు, కేంద్ర, రాష్ట్ర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

# 2 పళ్ల రాష్ట్ర ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శన విభాగంలో మొదటి స్థానం సాధించిన పియస్ఆర్ పెద్దకొత్తపల్లి గిత్తలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)
మద్దిపాడు మండలం తెల్లబాడు, దొడ్డవరం గ్రామాల నందు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవం సందర్భంగా స్వర్గీయ మల్లిపెద్ది రామకృష్ణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగుడు బలప్రదర్శన గురువారం హోరా హోరీగా జరిగాయి. ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శనలో 2 పళ్ల విభాగంలో 16 జతలు పాల్గొన్నాయి. మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన పోతినేని శ్రీనివాసరావుకి చెందిన పియస్ఆర్, గిత్తలు (ఎడ్లు) 3568.5 లాగి మొదటి స్థానాన్ని గెలుచుకున్నాయి. మొదటి స్థానం గెలుచుకున్న పోతినేని శ్రీనివాసరావుకి మద్దిపాడు ఎస్ఐ జి వెంకట్, కమిటీ సభ్యులు బహుమతి ప్రధానం చేశారు. పలువురు మండల నాయకులు, అక్కడికి వచ్చిన రైతులు శ్రీనివాసరావుని అభినందించారు.





4

ఈ

# తలీం-ఏ-హునర్ పథకంపై అవగాహన

## 17న టాలెంట్ టెస్ట్ పరీక్ష



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 8)
పొదిలి పెద్దమసీదులో తలీం-ఏ-హునర్ పథకం గురించి తెలియజేస్తూ శుక్రవారం ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం విద్యార్థులకు ఒక వినూత్నమైన పథకం రాష్ట్ర వాఫ్క్ బోర్డు ద్వారా ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 10వ తరగతి చదువుకున్న పిల్లలు ఉన్నతమైన ఉద్యోగం చేయాలి, సమాజంలో మంచి డాక్టర్ లుగా ఎదగాలని ఈ మంచి పథకం ప్రవేశపెట్టారన్నారు. 10వ తరగతిలో 450కి పైగా మార్కులు వచ్చిన విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన టాలెంట్ టెస్ట్ నిర్వహించి, అందులో మంచి మార్కులు వచ్చిన 250 మందికి ఉచితంగా ఇంటర్మీడియట్ కార్పొరేట్ కాలేజీలలో చదివించి వారికి ఐఐటీ, జెఈఈ, నీట్, ఎంసెట్ కోచింగ్ ఉచితంగా రెసిడెన్షియేల్ విద్య కల్పిస్తున్న దేశంలో ఏకైక రాష్టం
(తరువాయి 4లో...)

# వేగంగా 22ఏ భూములకు పరిష్కారం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 8)
నిషేధిత 22ఏ జాబితాలోని భూముల సమస్యను త్వరగా పరిష్కరించే దిశగా జిల్లా అధికార యంత్రాంగ చర్యలు వేగవంతం చేసింది. తమ భూముల వివరాలు పొరపాటున ఈ జాబితాలో చేరాయని, వీటిని పరిష్కరించాలని మూడు డివిజన్లలో కలిపి జిల్లావ్యాప్తంగా 591 దరఖాస్తులు వచ్చినట్లు డిఆర్ఓ బి చిన ఓబులేసు తెలిపారు. ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ ద్వారా వీటిని జిల్లా కేంద్రానికి తెప్పిస్తున్నామని చెప్పారు. గురువారం నాటికి 439 వచ్చినట్లు వివరించారు. వీటిని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశాల మేరకు ప్రతివారం కలెక్టరేట్లో తహసీల్దారులతో తాను వెరిఫికేషన్ చేయిస్తున్నట్లు చెప్పారు. వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.





# రెండవ రోజు కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎస్పీ





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 8)
అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న రాష్ట్ర స్థాయి 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ల సదస్సులో రెండవ రోజు శుక్రవారం ప్రకాశం, మార్కాపురం జిల్లా కలెక్టర్లు పి రాజాబాబు, ఎం విజయ సునీత, జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, శాంతి భద్రతలు తదితర అంశాల పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి, సంబంధిత అధికారులకు పలు దిశా నిర్దేశాలు చేశారు.

# 2 పళ్ళ రాష్ట్ర ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శన విభాగంలో మొదటి స్థానం సాధించిన పియస్ఆర్ పెద్దకొత్తపల్లి గిత్తలు





# తలీం-ఏ-హునర్ పథకంపై అవగాహన

ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. ముస్లింలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆలోచించే నాయకుడు చంద్రబాబు అని అన్నారు. ఈ పథకం రూపొందించి అమలుకు ప్రయత్నం చేసిన రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎంఏ షరీఫ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు రసూల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ మాగుంట




# నేడు విద్యుత్ అంతరయానికి ప్రజలు సహకరించాలి

**బద్వేల్ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు సంభవిస్తే తమ దృష్టికి తీసుకురావాలి**
**విద్యుత్ శాఖ డిఈఈ కులాయప్ప**



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 8) బద్వేల్ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించే విధంగా కృషి చేస్తామని విద్యుత్ శాఖ డిఈఈ యం కులాయప్ప, టౌన్ ఏఈ మేరీ షర్మిలరాణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం విద్యుత్ సరఫరా లో 33/ 11 కేవీ సబ్ స్టేషన్ అయినటువంటి బద్వేల్, గుంతపల్లి, వెంకటశెట్టిపల్లి, కొత్తచెరువు ఆర్టీవో ఎస్ఎస్‌పిపి కుంట, గానుగపెంట సబ్ స్టేషన్ల మరమత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని వారు తెలిపారు. అనంతరం విద్యుత్ యధావిధిగా సరఫరా అవుతుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు, రైతులు, వ్యాపారస్తులు, ప్రజలు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు. అలాగే బద్వేల్ ప్రాంతంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు సంభవిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# జమ్మలమడకలో బాలికల శిక్షణ కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 8)
జమ్మలమడక గ్రామంలోని అంగనవాడి కేంద్రంలోని శుక్రవారం కిశోర బాలికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం 11 నుంచి 18 సంవత్సరాల బాల బాలికలకు విద్య, పౌష్టిక ఆహారం వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంగా, సురక్షితంగా, ఉండేందుకు మంచి నిర్ణయాలు తీసుకోవడానికి, ఇతరులతో మంచిగా మెలగడానికి, ఇతరులను గౌరవించడం వంటి మంచి లక్షణాలు పెంపొందుతాయని తెలియజేశారు. స్వీయ అవగాహన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఆడపిల్లలు స్కూలు మాని వేయకుండా ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి సిబ్బంది పాల్గొన్నారు.




# సిఐ, ఎస్ఐలకు సత్కారం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 8)
మార్కాపురంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ అల్తాఫ్ హుస్సేన్, మార్కాపురం పట్టణ ఎస్ఐ విశ్వనాథరెడ్డి, రూరల్ ఎస్ఐ వి వేమన లను బిజెపి నాయకులు శుక్రవారం వారి వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థాన కమిటీ సభ్యులు విజయరావు, నరసింహారావు, పిన్నెబోయిన శ్రీనివాసులు, బెల్లంకొండ గోపి, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎన్‌వి సురేష్, కంభం వెంకట రమణ, షేక్ ఖాశిం వలి, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు వీరిశెట్టి శ్రీనివాసులు, శివ సింగ్, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.






# ‘నేను కాదు మనం’ అనే స్ఫూర్తితో పనిచేయాలి

## ముగిసిన 7వ జిల్లా కలెక్టర్ల సమావేశం

## చంద్రబాబు కీలక ప్రసంగం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 08)
25 ప్రాధాన్యతా ప్రాజెక్టుల పూర్తికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల
అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు సంతృప్త స్థాయిలో ఇవ్వాలని ఆదేశం
23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామన్న సీఎం రాష్ట్ర పరిపాలనలో ప్రజలే కేంద్రంగా పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలని, ‘నేను కాదు, మనం’ అనే సామూహిక స్ఫూర్తితో ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో రెండు రోజుల పాటు జరిగిన 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ శుక్రవారం ముగిసింది. సుమారు 22 గంటల పాటు సాగిన ఈ మారథాన్ సమావేశాల్లో కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి పలు కీలక అంశాలపై సమీక్షించారు. ముగింపు ఉపన్యాసంలో రాష్ట్ర సాగునీటి రంగంపై కీలక ప్రకటన చేస్తూ, 25 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దిష్ట గడువులోగా పూర్తిచేసేందుకు ఉద్దేశించిన ‘ఇరిగేషన్ క్యాలెండర్’ను విడుదల చేశారు.

పాలనలో టీమ్ వర్క్ ప్రాధాన్యతను ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. “నేను అనే అహం వీడి, మనం అనే భావనతో కలిసికట్టుగా పనిచేస్తేనే అద్భుతమైన ఫలితాలు సాధించగలం. మన పాలన పూర్తిగా పౌర కేంద్రంగా (సిటిజెన్ సెంట్రిక్) ఉండాలి. నేను ప్రతి సోమవారం ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలు వింటున్నాను. ఇకపై మీరు కూడా ప్రతి శుక్రవారం ఒక నియోజకవర్గానికి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలి” అని అధికారులను ఆదేశించారు.

అత్యుత్తమ పాలనా విధానాలను అధ్యయనం చేసేందుకు మంత్రుల బృందాన్ని సింగపూర్ పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

### అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలని, కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. “రాష్ట్రంలో రహదారులు, వీధిదీపాలు, మురుగునీటి పారుదల వంటి మౌలిక వసతులను మెరుగుపరచడంపై దృష్టి సారించాం. పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు ‘పీ4’ (ప్రజలు, ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం” అని వివరించారు.

ప్రజలపై విద్య, వైద్యం, విద్యుత్ భారాన్ని తగ్గించేలా అధికారులు చొరవ చూపాలని, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. తాము నిర్వహించే సమీక్షలు, సమావేశాలన్నీ పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమం కోసమేనని గుర్తుంచుకోవాలన్నారు.



పెట్టుబడుల ఆకర్షణలో ఏపీకి బ్రాండ్ ఇమేజ్

రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక విధానాల వల్ల గత 23 నెలల్లో నెలకు లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దీనివల్ల 24 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. “ఏపీకి ఉన్న బ్రాండ్ ఇమేజ్ కారణంగానే పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే ఇవి సాధ్యమవుతాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి” అని ఎస్పీలకు సూచించారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామని, వాటిని క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా (గ్రౌండింగ్) చూసే బాధ్యత కలెక్టర్లు, ఎస్పీలు తీసుకోవాలని ఆదేశించారు. గూగుల్, రిలయన్స్ వంటి డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో వస్తున్న పెట్టుబడులు రాష్ట్ర భవిష్యత్తుకు సంకేతమని అన్నారు.

### లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ... మౌలిక సదుపాయాల కల్పన

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు తెలిపారు. “రాష్ట్రంలో రూ.1.03 లక్షల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఇచ్ఛాపురం నుంచి చెన్నై వరకు నాలుగు లైన్ల రైల్వే ట్రాక్ రాబోతోంది. రూ.10 వేల కోట్లతో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నాం. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే ఏపీ దేశంలోనే కీలకమైన లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుంది,” అని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుల వేగవంతమైన పూర్తికి భూసేకరణ వంటి అంశాలను కలెక్టర్లు చొరవ తీసుకుని పరిష్కరించాలని సూచించారు.

### సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం.. ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల

రాష్ట్ర జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి ప్రకటించారు. “పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు, విశాఖ పరిశ్రమలకు నీరందిస్తాం. ఈ ఏడాది వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయబోతున్నాం. నేరడి బ్యారేజ్ పనులు కూడా ఈ ఏడాదే ప్రారంభిస్తాం. ఉత్తరాంధ్రలోని పెండింగ్ ప్రాజెక్టులను వచ్చే రెండేళ్లలో, రాయలసీమలో హంద్రీనీవా ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇందులో భాగంగా 25 ప్రాధాన్యతా ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నాం” అని తెలిపారు. గుంటూరు ఛానల్, తుంగభద్ర, కాటన్ బ్యారేజ్ గేట్ల మరమ్మతులు కూడా ఇందులో భాగంగానే పూర్తి చేస్తామని చెప్పారు.

### అందరికీ ఇళ్లు.. సంక్షేమ పథకాల పటిష్ఠ అమలు

సంతృప్త స్థాయిలో అందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. “ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలి. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి వాటిని క్రమబద్ధీకరించాలి. 22ఏ భూముల సమస్యలను వచ్చే కలెక్టర్ల సమావేశంలోగా పరిష్కరించాలి” అని ఆదేశించారు.

బుడగజంగాలకు ఎస్సీలకు వర్తించే ప్రయోజనాలను (ఉద్యోగాలు మినహా) అందించాలని, బీసీ రిజర్వేషన్ల కోసం కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ తీసుకురావాలని, జాతీయ, అంతర్జాతీయ విద్య కోసం పావలా వడ్డీకే రుణాలు అందించాలని సూచించారు. అధికారులు టాస్క్ ఫోర్స్‌గా ఏర్పడి, ఉత్తమ పద్ధతులను అవలంబిస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# చర్చలు విఫలం

## మే 15న సమగ్ర శిక్షా ఉద్యోగుల మహా పాదయాత్ర యథాతథం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)**

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై జేఏసీ రాష్ట్ర నాయకత్వంతో రాష్ట్ర అధికారులు ఆన్లైన్ ద్వారా చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మే 15న నిర్వహించనున్న మహా పాదయాత్రను వాయిదా వేసుకోవాలని కోరారు. అయితే పాదయాత్ర సందర్భంగా జేఏసీ ఉంచిన ప్రధాన డిమాండ్లలో రెగ్యులర్, హెచ్ఆర్ పాలసీ, ఎంటిఎస్, వేతనాలు పెంపు ఒక్కదాని పైనా స్పష్టమైన నిర్ణయం రాకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో మే 15న విజయవాడ నుండి విద్యాశాఖ మంత్రి నివాసం వరకు కుటుంబ సభ్యులతో కలిసి చేపట్టనున్న మహా పాదయాత్రలో ఎలాంటి మార్పు లేదని జేఏసీ రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. పాదయాత్ర సందర్భంగా లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా చొరవ తీసుకొని ఉద్యోగులకు న్యాయం చేయాలని జేఏసీ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. అలాగే ఇటీవల అసంబద్ధంగా నిర్వహించిన కేజీబీవీ టీచర్స్ బదిలీలను వెంటనే రద్దు చేసి, స్పష్టమైన, నిర్దిష్టమైన నియమ నిబంధనల ఆధారంగా పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని జేఏసీ నాయకులు, చర్చల్లో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తరఫున జరిగిన చర్చల్లో సమగ్ర శిక్షా అడిషనల్ ఎస్పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి, కేజీబీవీ సెక్రటరీ దేవానందరెడ్డి పాల్గొన్నారు. జేఏసీ తరఫున గౌరవ అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు, రాష్ట్ర చైర్మన్ కాంతారావు నాని, సెక్రటరీ జనరల్ కళ్యాణి, ఆర్గనైజేషన్ సెక్రటరీ జాన్ మోడీ, వైస్ చైర్మన్ వాసా శ్రీనివాసరావు, కోచైర్మన్ రఫీ, ఓబులరెడ్డి, శ్రీరాములు, రామన్న, కేజీబీవీ టీచర్స్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు విజయ గౌరీ, అధ్యక్షులు శ్రీరేఖ, ప్రధాన కార్యదర్శి తేజస్విని, రమాదేవి, కేజీబీవీ టీచర్స్ యూనియన్ నాయకులు రత్నమాలిని, సిఆర్ఎం టీచర్స్ ప్రోగ్రెసివ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్, రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాధర్, సెట్ ఇంజనీర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి గంగరాజు పాల్గొన్నారు.

# జాతీయ నాణ్యత ధృవీకరణ పొందిన మేదరమెట్ల పీహెచ్‌సీ



**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 8)**

మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు ప్రదానం చేసే జాతీయ నాణ్యత ధృవీకరణ సర్టిఫికేషన్‌ను సాధించింది. ఇటీవల ఏప్రిల్ 22, 23 తేదీల్లో కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు నిపుణుల బృందం ఆసుపత్రిని రెండు రోజుల పాటు సమగ్రంగా పరిశీలించింది. ఈ సందర్భంగా కాన్పుల సేవలు, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ సేవలు, రక్త పరీక్షలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆసుపత్రి పరిపాలన, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు అందించారు. ముఖ్యంగా పేద రోగులను ప్రేమతో, సహానుభూతితో చూడాలని, వారికి సరైన చికిత్సతో పాటు తగిన మందులు అందించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో దోమల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందస్తు ఆరోగ్య చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. కాన్పుల సేవల్లో ఆషా కార్యకర్తలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలని కూడా బృందం అభిప్రాయపడింది.మొత్తం ఆరు విభాగాలకు సంబంధించిన సేవల పరిశీలనలో మేదరమెట్ల పీహెచ్‌సీకి 85.80 శాతం మార్కులు లభించగా, మూడు సంవత్సరాల పాటు చెల్లుబాటు అయ్యే పూర్తి స్థాయి జాతీయ నాణ్యత ధృవీకరణ సర్టిఫికేట్‌ను మంజూరు చేశారు. భవిష్యత్తులో కేంద్ర అధికారుల తనిఖీల సమయంలో మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ విజయానికి సహకరించిన సహచర వైద్యాధికారులు, జిల్లా ఎన్‌క్యూఏఎస్ సమన్వయకర్త, ఆసుపత్రి సిబ్బందికి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి చిట్టిబాబు అభినందనలు తెలిపారు. ఈ సర్టిఫికేషన్ సిబ్బందికి మరింత ఉత్సాహాన్ని కలిగిస్తుందని, భవిష్యత్తులో 100 శాతం నాణ్యత సాధించేందుకు కృషి చేస్తామని ఆసుపత్రి సిబ్బంది పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు, రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మాత్రమే ఈసారి జాతీయ నాణ్యత ధృవీకరణ లభించగా, అందులో మేదరమెట్ల పీహెచ్‌సీ చోటు దక్కించుకోవడం మండలానికి, జిల్లాకే గర్వకారణమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 8)**

దేశాన్ని క్షయ రహితంగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బీసీ కాలనీలో శుక్రవారం ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ముఖ్యంగా 14 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు గల వారికి డిజిటల్ ఎక్స్‌రే ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి శరత్ చంద్ర పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి తక్షణమే వైద్య సలహాలు, అవసరమైన మందులను సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఇలాంటి ఉచిత పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షయ వ్యాధి పట్ల భయం వద్దన్నారు. సకాలంలో గుర్తిస్తే వ్యాధిని సంపూర్ణంగా నయం చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సారా, శ్రీకాంత్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయితీ పై వ్యవసాయ పరికరాలు

## 50% రాయితీ పై పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు సరఫరా

### ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 8)**

రాయితీ పై వ్యవసాయ పరికరాలు, 50 శాతం రాయతీ పై పచ్చిరొట్ట, ఎరువు, విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ 2025-26కి సంబంధించి పొదిలి మండలానికి తొమ్మిది కేటగిరీలకు చెందిన వివిధ రకాల ట్రాకర్స్, వాటి పనిముట్లు ప్రభుత్వం ద్వారా 50%, 40% రాయితీ పై రైతులకు సరఫరా చేసేందుకు రూ.19.60 లక్షలు పొదిలి మండలానికి కేటాయించారన్నారు. చిన్న, సన్న, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం రాయితీ పై, అలాగే పెద్ద రైతులకు (4.97 ఎకరాల పైన) 40 శాతం రాయితీ పై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన రైతులకు తెలిపారు. పూర్తి వివరాల కోసం మీ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆన్లైన్ పద్ధతిలో వెబ్‌సైట్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. లేని పక్షంలో ఆండ్రాయిడ్ మొబైల్ వాడే ప్రతి రైతు తాను కూడా స్వయంగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. పనిముట్లు కావాల్సిన రైతులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశన్ని అందరూ రైతులు ఉపయోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి, పొదిలి వారు రైతులను కోరారు. అలాగే ఆ మండలంలో పొదిలి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ ఖరీఫ్ 2026 సీజన్లో పచ్చి రొట్ట ఎరువులు 50% రాయితీ పై అందుబాట్లో కలవన్నారు. జనుము ఒక కేజీ పూర్తి ధర రూ.196లు రేయితీ ధర రూ.77లు రైతు వాట రూ.77లు, జీలుగా ఒక కేజీ పూర్త ధర రూ.160లు రాయితీ ధర రూ.80లు రైతు వాట రూ.80లు, పిల్లి పెసర విత్తనాలు ఒక కేజీ పూర్తి ధర రూ.196లు రాయితీ ధర రూ.98లు రైతు వాట రూ.98లు గా ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందని, కావున కావాల్సిన రైతు సోదరులందరూ మీ పరిధిలో ఉన్నటువంటి రైతు సేవా కేంద్రానికి ఆధార్ కార్డు, పట్టదార్ పాసుబుక్, తీసుకుని వెళ్లి నమోదు చేయించుకొని ఆ విత్తనాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 8)**

మండలంలోని రామాపురం గ్రామంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల యొక్క ఉపయోగం, సమతుల్య ఎరువుల వాడకం పై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మన దేశంలోని జిల్లాలో అధిక రసాయన ఎరువులు వాడుతున్న జిల్లాలో మన ప్రకాశం జిల్లా కూడా ఉందన్నారు. దానికి ముఖ్య కారణం మన నేలల్లో సేంద్రియ కర్బన శాతం చాలా తక్కువగా ఉండటమే అన్నారు. దిగుబదులు బాగా రావటానికి మన రైతులు ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడుతున్నారన్నారు. ఇక్కడ ఉన్న నేలల్లో సేంద్రియ కర్బన శాతం 0.5 శాతం కంటే చాలా తక్కువ ఉందన్నారు. మన భూముల్లో కర్బన శాతం పెంచటానికి పశువుల ఎరువు ఎక్కవగా వాడాలని సూచించారు. ఒక వేళ పశువుల ఎరువు లేకపోతే వానపాముల ఎరువుగానీ, పచ్చి ఆకు ఎరువులుగానీ, పచ్చిరొట్ట ఎరువువులను పొలంలో వేసి కలియదున్నుకోవడం వలన భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరగడం జరుగుంటుందని చెప్పారు. దీని వలన భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి భూమిలోపల ఉన్న పోషకాలు మొక్కకు అందుబాటులోనికి తీసుకొస్తాయని తెలియజేశారు. ఆలాగే ఎక్కువ రసాయనిక ఎరువులు వాడుకోవడం వలన భూమిలో నైట్రైట్ స్థాయి పెరిగి నీరు కలుషితం అవుతుందని, అలాగే అధిక ఎరువులు వాడుకోవడం వలన సాగు ఖర్చు పెరిగి లాభాలు తగ్గిపోతున్నాయని తెలియజేశారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఎరువులైన జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులు, వానపాముల ఎరువులను, మేకలు, గొర్రెల ఎరువులను వాడుకోవాలని తెలియజేశారు. అలాగే రైతులందరు భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. భూసార పరీక్షలు అనుసరించి ఎరువులు వాడుకొన్నట్లైతే సాగు ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విఏఏ, రైతులు పాల్గొన్నారు.




# కిశోరి బాలికలకు రక్తహీనత పై అవగాహన కల్పించిన వైద్యారోగ్య శాఖ





**(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, మే 8)**

మండల కేంద్రమైన మద్రిపూడి సచివాలయం పరిధిలోనీ వెస్ట్ అంగన్వాడి కేంద్రంలో జరిగిన కిసోరి బాలికలకు ఆరోగ్యమేల మరియు ఏనిమీయాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఎం పి హెచ్ ఎస్ ఎఫ్ రమాదేవి మాట్లాడుతూ కిశోరీ బాలికలకు రక్తహీనత రాకుండా ఉండాలి అంటే సరైన పోషకాహార విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు. పంచాయతీ కార్యదర్శి బివి నాయుడు ప్రసంగిస్తూ సరైన ఆహారం తీసుకుంటే పిల్లలు మానసికంగా శారీరకంగా అభివృద్ధి చెందుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బాల బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ కృష్ణవేణి, ఏఎన్ఎం పుణ్యవతి, అంగన్వాడి కార్యకర్తలు కెపి హైమావతి సుధేష్ణ కామేశ్వరి ప్రభావతి గ్రేసమ్మ కేజీయామ్మ, ఆశా వర్కర్లు రజిత, రమణ, విజయమ్మ, సిపోరి శైలజ, కిసోరీ బాలికలు, బాలురులు, విఓఏలు తదితరులు పాల్గొన్నారు.

# కిశోరి వికాసం-2026 వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమం






**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 8)**

కనిగిరి మండలం చిన అలవలపాడు ప్రాథమిక పాఠశాలలో కిశోరి వికాసం-2026 వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌమార బాల బాలికలను ఉద్దేశించి విద్య ఆవశ్యకతపై పార్వతి మాట్లాడుతూ విద్య మానవ జీవితంలో అత్యంత కీలకమైన అంశమని, వ్యక్తిగత వికాసానికి, సమాజ అభివృద్ధికి, సృజనాత్మకు మరియు మంచి నడవడికకు, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి, దేశ ప్రగతికి విద్య అత్యంత ఆవశ్యకమని అన్నారు. బాలబాలికలందరూ పాఠశాల విద్యను అభ్యసించాలని, బాల్యవివాహాలను నిర్మూలించాలని అన్నారు. బాల్యవివాహ నిరోధక చట్టం, పోషకాహారం ,ఆరోగ్యం పరిశుభ్రత, కమ్యూనికేషన్ పై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమం మే 1 నుండి జూన్ 11 వరకు అన్ని కేంద్రాలలో నిర్వహించబడతాయన్నారు. తదుపరి గ్రామంలో కిశోరి వికాసం అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎం జ్యోతి, గ్రామంలోని కౌమార బాలబాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

**(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, మే 8)**




నూజెండ్ల మండలంలోని గురుపనాయుడుపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి ఒక్కసారిగా తిరగబడింది. ఈ ప్రమాదంలో లింగంగుంట్ల దావీదు (35) ట్రాక్టర్ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చేతికి అందివచ్చిన యజమాని మృతి చెందడంతో దావీదు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో గురుపనాయుడుపాలెం గ్రామంతో పాటు మృతుడి స్వగ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నారు.

## కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 8)

ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని గుడ్లూరు మండలం నందు సిడీపీఓ డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కిశోర వికాసం మొత్తం 12 థీమ్స్ తోటి ఉంది. ఇందులో భాగంగా శుక్రవారం రక్తహీనత, అనిమియా గురించి 11-18 సంవత్సరాల పిల్లలకు అవగాహన, రక్తహీనత లక్షణాలు నివారణ చర్యల గురించి క్లుప్తంగా తెలియజేశారు. టీనేజ్ లో ఎదుర్కొనే సమస్యల గురించి వివరించడం జరిగింది. మెడికల్ ఆఫీసర్స్ ఆసం, రమ్య దీపిక పిల్లల ఆరోగ్యం, అవసరాలు, మంచి ఆహారం గురించి వివరించారు. సూపర్వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ రక్తహీనత వల్ల పిల్లలకు వచ్చే సమస్యలు పరిష్కార మార్గాలు, ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు రక్తహీనత నివారణ చర్యలు గురించి వివరించారు. సిహెచ్ఓ సుబ్బారావు రక్తహీనత నివారణలో ఐరన్ సిరప్ ఉపయోగం ఎలా వాడాలి మోతాదులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ఏటీఎం, సిహెచ్ఓ, మెడికల్ ఆఫీసర్స్, ఏఎన్ఎమ్స్, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుకల్లో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి





(షణ్ముఖ వెలుగు, పామూరు, మే 8)

జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ శుక్రవారం పలు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. దర్శి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎర్రగొండ సాయి రామ్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కనిగిరి పట్టణం నందు తాళ్లూరి కళ్యాణ మండపం నందు శ్రీరామ్ సోలార్ మేనేజింగ్ పార్ట్నర్ చమ్మిడిచెట్టి రాజశేఖర్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం పామూరు మండలం రామాపురం గ్రామం నందు నాగేంద్ర వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బెంగళూరులో ప్రముఖ వ్యాపారవేత్త గాడి మహేంద్ర, గద్దె సుధాకర్, టి మల్యాద్రిరెడ్డి, కే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో 37 అర్జీలు స్వీకరణ



(షణ్ముఖ వెలుగు, చీరాల, మే 8)

ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హాజరై ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. మొత్తం 37 అర్జీలు అందగా, వాటిలో ఇంటి నిర్మాణాలు, ఇంటి స్థలాల కోసం 5 పింఛన్లకు సంబంధించి 27 ఇతర సమస్యల పై 5 అర్జీలు వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# జిజిహెచ్ ఆసుపత్రులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా నివారించాలి





### అవగాహన కల్పించిన ఫైర్ సిబ్బంది





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)

అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నివారించవచ్చు అనేదానిపై జిజిహెచ్‌లో అవగాహన కల్పించామని జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ అద్దయ్య తెలిపారు. జిజిహెచ్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుండి 10వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవం జరుగుతుందని అందులో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేశారని తెలిపారు. జిజిహెచ్ లో ప్రతి విభాగంలో అగ్ని ప్రమాద నివారణ కొరకు అన్ని ఏర్పాట్లు అందుబాటులో ఉన్నాయని ప్రమాదం జరిగిన వెంటనే నియంత్రించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ప్రతి వారానికి ఒకసారి సిబ్బందికి అవగాహన కలిగించడం వలన ఏదైనా అనుకోని విధంగా ప్రమాదం జరిగినప్పుడు నివారించడానికి ఎక్కువగా అవకాశం ఉంటుందని అందులో భాగంగా అగ్నిమాక శాఖ ద్వారా అవగాహన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి ఎం చంద్రమౌళి, సిఎస్ఆర్ఎమ్ఓ డాక్టర్ మాధవి లత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉలవపాడులో కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 8)

మండల కేంద్రమైన ఉలవపాడు సిహెచ్‌సి నందు శుక్రవారం సిడిపిఓ డి మాధవిలత ఆధ్వర్యంలో సూపర్వైజర్ కె రమాదేవి డాక్టర్ల సమక్షంలో కిశోర వికాసం వేసవి సెలవులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా డాక్టర్ లక్ష్మీ రక్తహీనత ఎలా వస్తుంది, ఎలా నివారించాలి, అనే విషయాలు అన్నీ తెలియజేశారు. ఇందులో భాగంగానే డాక్టర్ ప్రదీప్ కిశోర బాలురులకు రక్త హీనత వస్తే ఎలాంటి వ్యాధులు రావచ్చును, వాటిని ఎలా నివారించాలి వాటికి ఎలాంటి ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. డాక్టర్ ఐశ్వర్య ఆల్బెండజోల్ మాత్రలు, హెల్త్ ఎడ్యుకేషన్ గురించి వివరించారు. సిడిపిఓ వీరందరికీ కూడా బాల్యవివాహాల గురించి వివరించారు. సూపర్వైజర్ అందరూ చదువుకోవాలని, పిల్లలు స్కూల్ మానేయరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, కిషోరి బాలికలు, కిషోరి బాలురు పాల్గొన్నారు.



## కిశోర వికాసంలో పాల్గొన్న సిడిపిఓ ఝాన్సీ



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, మే 8)

పందిళ్ళపల్లి సెక్టార్ లోని రామచంద్రపురం నందు శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఝాన్సీ పాల్గొని బాలికలకు ఐరన్, పౌష్టికాహారం గురించి వివరించారు. కూల్ డ్రింక్స్, ఫాస్ట్ ఫుడ్ లకు దూరంగా ఉండాలని సిడిపిఓ ఝాన్సీ సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టిక ఆహారం లో ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉండటంతో బాలికలు ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలియజేశారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సిడిపిఓ ఝాన్సీ పేర్కొన్నారు. ఈ కిశోర వికాసం కార్యక్రమాన్ని అన్ని సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శేషమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 8)



ఒంగోలులోని విద్యుత్ భవన్లో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో శుక్రవారం జిల్లా విద్యుత్ భవన్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, పరివర్తకాల పనితీరు, స్మార్ట్ మీటర్ల గురించి, విద్యుత్ శాఖ మీద ప్రజల అభిప్రాయం, రానున్న వేసవిలో నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ అందించడం కోసం తీసుకోవలసిన చర్యలు వాటి ప్రణాళికలు గురించి చర్చించారు. మాపింగ్, డీటీర్ మాపింగ్ అన్ని 33 కేవీ, 11 కేవీ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానమైన సర్వీసుల వివరములన్నియు ఆన్లైన్‌లో పొందుపరచడం ద్వారా సత్వరమైన వినియోగదారుల సేవలు అందించేందుకు ఆదేశాలిచ్చారు. తదుపరి విద్యుత్ కనెక్షన్, బకాయిలు మీద సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే జిల్లాలో సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు అధికంగా ఏర్పాటు చేయడం కోసం ప్రతి ఒక్క విద్యుత్ అధికారి కృషి చేయాలని ఆదేశించారు. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందరికీ అందించాలని, దాని కోసం ఫీడర్ పెట్రోలింగ్ చేసి లోపాలను సరి చేయాలన్నారు. తద్వారా ప్రజలకు విద్యుత్‌శాఖ పట్ల సంతృప్తి స్థాయిలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈలు, డిఈఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



# పేరుకే మార్కాపురం....జిల్లా అంత డొల్ల...!!

## ఉమ్మడి ప్రకాశం జిల్లా డిసిసి అధ్యక్షులు షేక్ సైదా







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 8)

మార్కాపురం నూతన జిల్లా ఏర్పడి ఐదు మాసాలు పూర్తికావస్తున్న జిల్లాకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పన నేటి వరకు జరగలేదని, వివిధ శాఖల కార్యాలయాలు కూడా ఏర్పాటు కాలేదని, శాంతి భద్రతను కాపాడవలసిన ఎస్పీ పోస్ట్ సైతం ఇప్పటికీ పూర్తి చేయలేదని ఉమ్మడి ప్రకాశం జిల్లా డిసిసి అధ్యక్షులు షేక్ సైదా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మార్కాపురం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రెవిన్యూ శాఖలో అనేక ఖాళీలు భర్తీ చేయవలసి ఉందన్నారు. అలాగే విద్య, వైద్యం, పంచాయతీరాజ్‌శాఖలో కూడా ఇన్చార్జి పాలనలో నడుస్తున్నాయని పేరుకే మార్కాపురం జిల్లా అని అంతా డొల్లని అన్నారు. మార్కాపురం జిల్లా సాధన కోసం 65 రోజుల పాటు సుదీర్ఘంగా సాగిన ఉద్యమంలో అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల నాయకత్వంలో జరిగిన ఉద్యమ ఫలితంగా జిల్లాని సాధించుకున్నామని, అయితే జిల్లా సాధించుకున్నాం అనే ఆనందం ఇప్పుడు మార్కాపురం ప్రాంతంలో జరుగుతున్న భూకబ్జాలు, ల్యాండ్ మాఫియా, మైనింగ్ మాఫియా, రేషన్ మాఫియా, లిక్కర్ మాఫియా చూసి ఆనందం కాస్త ఆవిరైపోతుందన్నారు. ప్రతి సోమవారం జరిగే జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ మార్కాపురం పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంగా ఉన్న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కాకుండా మార్కాపురం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేయమని కలెక్టర్‌ని కలిసి కాంగ్రెస్ ప్రతినిధి బృందం విన్నవించి మూడు వారాలు కావస్తున్న ఇప్పటికీ ఆ దిశగా ప్రయత్నించకపోవడం బాధాకరమన్నారు. ప్రజల సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వం అయితే వెంటనే ఆ విధంగా చర్యలు చేపట్టాలని, అధికారులు, జిల్లా కలెక్టర్ ప్రజలు, అర్జీదారులకు ప్రయోజనం కలిగే విధంగా ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వ భూములు పేద ప్రజల ప్రవేట్ భూములు కబ్జాకు గురి కాకుండా, కొండలను పిండి చేసి గ్రావిల్ను తరలించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి నిధులు కేటాయించాలని, వట్టి మాటలతో వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కాదని రూ.4 వేల కోట్లు ఖర్చు పెడితే తప్ప ప్రాజెక్టు పూర్తి కాదని, నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ ఇవ్వగలరన్నారు. జూన్ కి వెలుగొండ ప్రాజెక్ట్ ని పూర్తి చేస్తాం అన్న చంద్రబాబు మాటమీద నిలబడాలని, ఇంకా కేవలం నెల మాత్రమే ఉందన్నారు. ఈ నెల కాలంలో ప్రాజెక్టు పూర్తయ్యేది ఎప్పుడు అని సైదా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు 30 సంవత్సరాల నుంచి ఇదే మాట చెప్పి పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారని సైదా తీవ్రంగా విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ప్రాజెక్టు వెంటనే నిర్మాణం చేపట్టకపోతే ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డితో కలిసి మార్కాపురం కేంద్రంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. మీడియా సమావేశంలో జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ మహబూబ్ వలి, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు సామ్యూల్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ షేక్ అల్తాఫ్ బాషా, సుభాని, షేక్ నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీ, టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరిక**

మార్కాపూర్ పట్టణ కేంద్రంలోని పలువురు తెలుగుదేశం, వైసీపీ పార్టీకి చెందిన కార్యకర్తలు, సానుభూతిపరులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ అలీ సారథ్యంలో మార్కాపురం పట్టణానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన షేక్ షావలి, డి నాగరాజు, షేక్ బడే సుభాని, షేక్ జాకీర్, సయ్యద్ రహమతుల్లా, షేక్ గౌస్ బాషా, పఠాన్ హసన్ భాష, షేక్ గౌస్ బాషా, షేక్ మీ రావాలి, కే. శేఖర్, నాగరాజు తదితరులు తమ కుటుంబ సమేతంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన పలువురు నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే అలాగే లౌకిక వ్యవస్థ మన కలగాలంటే ఒక కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని వారన్నారు.






## అనీమియా పై అవగాహన కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 8)

మండల కేంద్రమైన పొన్నలూరు సచివాలయంలో, మాలపాడు ముప్పాళ్ళ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం అనీమియా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వానా మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఆకుకూరలు వేరుశనగ కర్పూరం బెల్లం ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని కిషోర్ బాలల తల్లిదండ్రులకు తెలిపారు. పోషక ఆహారాలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు మధురవాణి, గౌసియా, రాధా, వాణి, పద్మజ, ఆశా కార్యకర్తలు, వైద్యాధికారి మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి నారాయణ, తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ బస్సులు సకాలంలో లేక ఇబ్బందులు

### 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, కరేడు మాజీ ఎంపీటీసీ సభ్యులు మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 8)

ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో మేజర్ పంచాయతీ అయినా కరేడు గ్రామానికి ఆర్టీసీ బస్సులు సకాలంలో లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎన్నిసార్లు ఉన్న అధికారులకు తెలియజేసిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మరియు కరేడు మాజీ ఎంపీటీసీ సభ్యులు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా త్వరలో కందుకూర్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆర్టీసీ వ్యవస్థ ఏర్పడిన నాటి నుండి కరేడు గ్రామానికి ప్రతినిత్యం ఆర్టీసీ సర్వీసులు తిరిగేవన్నారు. అలాంటిది సంవత్సర కాలం నుండి అధికారులు బస్సులు సక్రమంగా నడపకుండా కుంటి సాకులు చెబుతూ కాలం గడుపుతున్నారన్నారు. కింది స్థాయి అధికారులు పై స్థాయి అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ ఆర్టీసీ సర్వీసును తగ్గించారని, గతంలో ఉదయం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సింగరాయకొండ నుండి కరేడు ప్రతి గంటకు బస్సు ఉండేదన్నారు. అలాగే ఒంగోలుకు కూడా కరేడు నుండి బస్సులు ఉండేవన్నారు. అలాంటిది అన్నిటినీ తీసివేసి ప్రజలను ఇబ్బంది పెట్టటం అధికారులకు తగదన్నారు. ప్రస్తుతం ఉదయం 8 గంటలకి లాస్ట్ బస్సు అని మళ్లీ మధ్యాహ్నం 1 గంట వరకు ఒక్క బస్సు కూడా లేదన్నారు. ప్రజలు ప్రయాణం ఎలా చేయాలని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు కళ్లు తెరిచి గతంలో ఏ విధంగా బస్సులు నడిపారో అలాగే నడపాలని, లేని యడల కందుకూరు డిపో ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీనివాసులు స్పష్టం చేశారు.

## జూదగాళ్ల పై ప్రకాశం జిల్లా పోలీసుల ఉక్కుపాదం

### మద్దిపాడు ఎస్సీ కాలనీలో దాడి 3 మంది పట్టివేత

(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, మే 8)

సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే జూదం వంటి అక్రమ కార్యకలాపాల పై ప్రకాశం జిల్లా పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో జూదం నిర్వహిస్తున్న వారి పై ప్రత్యేక దాడి చేపట్టారు. మద్దిపాడు ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో 3 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.2,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు కుటుంబాల ఆర్థిక స్థితిని దెబ్బతీసి, ఇతర నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని పోలీసులు తెలిపారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై ప్రకాశం జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తారని, ప్రజలు తమ పరిసరాల్లో జరుగుతున్న జూదం, గంజాయి, బహిరంగ మద్యం సేవనం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.



## వ్యవసాయ యంత్రాల పై 50% వరకు రాయితీ



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 8)

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం కూలీలతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పసిగట్టి కూలీల కొరతను అధిమించేందుకు, సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద మండలానికి రూ.8.62 లక్షలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి పి జ్యోష్నాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధునిక యంత్రాలను కొనుగోలు చేయాలనుకునే రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఓసి, బిసి ,ఎస్సీ, ఎస్టివర్గాలకుచెందిన సన్న, చిన్న కారు రైతులతో పాటు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. ఇతర రైతులకు (పెద్ద రైతులు) 40 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా కింది యంత్రాలను రాయితీపై పొందవచ్చున్నారు. ట్రాక్టర్లు (40 హెచ్ పి లోపు) పవర్, టిల్లర్స్, రోటా వేటర్లు, 9 చెక్కల గొర్రు,11 చెక్కల గొర్రు, గుంటక బ్లేడ్, విత్తనాల గొర్రుమిల్లర్లు, వివిధ రకాల స్ప్రేయర్లు ఆసక్తి గల రైతులు సమీపంలోని మీసేవ కేంద్రంలో, స్వయంగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో కింద తెలిపిన పత్రాలు అవసరం, రైతు పట్టాదారు పాస్ బుక్, 1బి, ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ఖాతా వివరాలు, ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ (ఆర్‌సి) కాపీ ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే తులకు ఈ-పంట నమోదు తప్పనిసరి అన్నాకు. ఏవైనా సందేహాలు ఉంటే రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) సిబ్బందిని సంప్రదించాలని వ్యవసాయ అధికారి జ్యోష్నాదేవి సూచించారు.



# వేసవిలో కాస్త ప్రత్యేకంగా

ఈ మండే ఎండల్లో మీ ఫ్యాషన్ మాత్రమే మిమ్మల్ని తళుక్కుమనేలా చేస్తుంది. వేసవి సాయంకాలాల్లో స్నేహితులతో కలిసి చేసే డిన్నర్‌ను మరింత ప్రత్యేకంగా మార్చేస్తుంది. దానికోసం ఇలా చేసి చూడండి. అందరినీ ఇట్టే ఆకర్షించేస్తారు.ఓవర్‌సైజ్డ్... క్యాట్-ఐస్, దీర్ఘచతురస్రం లేదా వలయాకార లెన్స్ ఆకారాల్లో బోల్డ్‌ఫ్రేమ్‌ను ఎంచుకుంటే చాలు. అందరిలో ఫ్యాషన్ ఐకాన్ మీరే అవుతారు. రంగురంగుల లెన్స్‌లతోపాటు ఫంకీ స్టైల్ సన్‌గ్లాసెస్‌తో ఎండకు తెరవేయడంతోపాటు ట్రెండీగానూ కనిపించొచ్చు.బోల్డ్‌గా... చంకీ స్టేట్‌మెంట్ నెక్లెస్, పెద్ద పెద్ద చెవి పోగులతోపాటు అల్లికలతో వస్తున్న వివిధ రకాల బ్రేస్‌లెట్స్ మీ వార్డ్‌రోబ్‌లో ఉంటే చాలు. వేసవి విందుల్లో ప్రత్యేకంగా నిలవొచ్చు. చేతికి బంగారు బ్రేస్‌లెట్‌తోపాటు వెండి లేదా రంగురంగుల గాజులు కలిపి వేసుకోవచ్చు. బోల్డ్‌గా కనిపించే ఈ అలంకరణ ఎటువంటి అవుట్ ఫిట్‌కైనా ఇట్టే నప్పుతుంది.

వైబ్రెంట్‌గా... హ్యాండ్‌బ్యాగ్‌నీ మీ స్టైల్‌లో ఓ భాగంగా చేయొచ్చు. ఎటువంటి లుక్‌నైనా ఇది ఎలివేట్ చేస్తుంది. బోల్డ్ లేదా ముదురు, లేత వర్ణాల్లో ప్రత్యేకంగా కనిపించే పెద్దపెద్ద డిజైన్ బ్యాగ్‌లు ప్రస్తుతం ట్రెండ్ అవుతున్నాయి. అలాగే నియాన్, మెటాలిక్ క్లచ్ లేదా అలంకరణగా రకరకాల పూసలు, రాళ్లు ఉన్నవాటిని ఎంచుకుంటే గ్రాండ్‌గా కనిపిస్తారు. వీటితోపాటు మ్యాచింగ్‌ను అనుసరించకుండా రకరకాల ప్యాటర్న్‌లను కలపాలి. వెల్వెట్ దుస్తులతో లెదర్ ఆభరణాలను జత చేయడం లేదా చారల ప్యాంటుకు ఫ్లోరల్‌ప్రింట్ టాప్ జోడించడం వంటివి మనల్ని కొత్తగా కనిపించేలా చేస్తాయి. అలాగే ఎటువంటి దుస్తులతోనైనా జోడీ కట్టగలిగే మెరిసే హీల్స్, రకరకాల అలంకరణలతో లేదా స్టేట్‌మెంట్ షూలు వంటివి వార్డ్‌రోబ్‌లో ఉంటే చాలు. మాగ్జిమలిస్ట్ ఫ్యాషన్‌కు చిరునామా మీరే అవుతారంటే నమ్మండి. మరి మీరు ఏమంటారు?

# ఎండల్లో రక్తపోటు అదుపులో...

వేసవి కాలంలో ఎండల తీవ్రతకు రక్తపోటు హెచ్చుతగ్గులకు లోనయ్యే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా మహిళల్లో హార్మోన్ల మార్పులు, ఇంటి పనులు, డీహైడ్రేషన్ కారణంగా బీపీ పెరగవచ్చు. రక్తపోటును అదుపులో ఉంచుకోవడానికి వేసవిలో తీసుకోవాల్సిన ఆహారాలివి... శరీరంలో నీటి శాతం తగ్గితే రక్తం చిక్కబడి బీపీ పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. కొబ్బరి నీళ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది, ఇది సోడియం ప్రభావాన్ని తగ్గించి బీపీని నియంత్రిస్తుంది. అలానే పల్చటి మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి వేసుకుని తాగడం వల్ల శరీరం చల్లబడటమే కాకుండా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఉప్పు తక్కువగా, పంచదార లేకుండా తీసుకునే నిమ్మరసం రక్తనాళాలను మృదువుగా ఉంచుతుంది. పొటాషియం అధికంగా ఉండే అరటి పండ్లను తినొచ్చు. ఇది శరీరంలోని అదనపు సోడియంను బయటకు పంపించడానికి సహాయపడుతుంది. బీపీ అదుపులో ఉంటుంది. వేసవిలో దొరికే పుచ్చకాయలో 'ఎల్.సిట్రులిన్' అనే అమైనో యాసిడ్ ఉంటుంది, ఇది రక్తనాళాలపైన ఒత్తిడిని తగ్గిస్తుంది. అలానే సీజనల్‌గా వచ్చే తాటి ముంజలు, కర్బూజా పండ్లు శరీరానికి చలువ చేస్తాయి. సొరకాయలో నీటి శాతం ఎక్కువ, సోడియం తక్కువ. ఇది రక్తపోటు ఉన్న మహిళలకు మేలైన ఆహారం. అలానే, మెగ్నీషియం, పొటాషియం మెండుగా ఉండే ఆకుకూరల్ని తీసుకోవాలి. రోజూ భోజనంలో పెరుగు లేదా పల్చటి మజ్జిగ ఉండేలా చూసుకోవాలి. పెరుగులో ఉండే కాల్షియం రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.



**ఇవి వద్దు...** బీపీ ఉన్నవారు రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. ఊరగాయలు, అప్పడాలు, ప్యాక్ చేసిన చిప్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి. కాఫీ, టీలు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో వేడి పెరిగి బీపీ పెరిగే ప్రమాదం ఉంది. నూనె, కారం, ఘాటైన మసాలాలు వేసవిలో తగ్గించడం మంచిది.



# పోషకాల పానీయాలు

ఎండలు మండిపోతున్నాయి. ఈ క్రమంలో రోజంతా చురుగ్గా, అలసిపోకుండా ఉండాలంటే శరీరానికి తగిన పోషకాలు కూడా అందాలంటున్నారు నిపుణులు. ఇందుకు కొన్ని రకాల పానీయాలు తోడ్పడతాయంటున్నారు. ఇటు చల్లదనాన్ని, అటు అదనపు పోషకాలనీ అందించే ఆ పానీయాల గురించి తెలుసుకుందాం రండి..

**బత్తాయిం అల్లంం దాల్చిన చెక్క**

బత్తాయిని సన్నటి చక్రాల్లా తరిగి చల్లటి నీళ్లలో వేయాలి. దానిలో అల్లం ముక్క, అయిదారు పుదీనా ఆకులు, దాల్చిన చెక్క వేసి నాననివ్వాలి. బత్తాయి నుంచి విటమిన్- సి తగినంతగా లభిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. అల్లంలో పొటాషియం తగినంతగా లభిస్తుంది. దాల్చినచెక్కలోని పోషకాలు రక్త సరఫరాని మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ఈ పానీయం తాగితే దాహార్తి తీరడంతో పాటు ఆరోగ్యాన్ని కూడా సొంతం చేసుకోవచ్చుట.

**కీరాదోసం పుదీనాం నిమ్మ**

ఒక సీసాలో చల్లటి నీళ్లు పోసి... కీరాదోసని పలుచటి చక్రాల్లా తరిగి వేయాలి. పుదీనా ఆకులు, సన్నగా తరిగిన రెండు నిమ్మకాయ స్లైసులు వేసి నాలుగైదు గంటలు అలాగే ఉంచాలి. ఈ పానీయం శరీరాన్ని చల్లబరిచి సాంత్వననిస్తుందని చెబుతున్నారు నిపుణులు.

**పుచ్చకాయం కొబ్బరి నీళ్లుం తులసి**

కప్పు పుచ్చకాయ ముక్కల్లో కొన్ని కొబ్బరినీళ్లు పోసి గ్రైండ్ చేసుకోవాలి. దీంట్లో కొన్ని తులసి ఆకులు వేసుకుని తాగితే చాలు. పుచ్చకాయలోని లైకోపిన్ అనే యాంటీఆక్సిడెంట్ ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి కణాలను రక్షిస్తుందట. కొబ్బరి నీళ్ల నుంచి పొటాషియం, మెగ్నీషియం, క్యాల్షియం తగినంతగా లభిస్తాయి. దీన్ని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి అందుతుంది. అలాగే తులసిలో పలు ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు నిపుణులు.

ఈ పానీయాలను కొద్దిసేపు ఫ్రిజ్‌లో పెట్టి ఆ తర్వాత తీసుకోవచ్చు.. లేదంటే కొన్ని ఐస్ క్యూబ్స్ వేసుకుని చల్లచల్లగా తీసుకోవచ్చు.

# డబ్బు గురించి చెబుతున్నారా..?

తమ పిల్లలు మంచి ప్రయోజకులు కావాలని ప్రతి తల్లిదండ్రులు కలలు కంటారు. ఇందుకోసం చెమటోడ్చి ఉన్నత చదువులు చదివిస్తుంటారు. అయితే పిల్లలు ప్రయోజకులుగా మారాలంటే చదువుతో పాటు ఆర్థిక క్రమశిక్షణ కూడా ఎంతో అవసరం అంటున్నారు నిపుణులు. ముఖ్యంగా అమ్మాయిలకు చదువుతో పాటు ఆర్థికపరమైన విషయాల గురించి కూడా చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని చెబుతున్నారు.





**అమ్మాయితో చర్చించండి..** ఇటీవలి కాలంలో పరిస్థితులు మారుతున్నా.. మన దేశంలో ఇప్పటికీ చాలామంది మహిళలు ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకునే విషయంలో తమ తండ్రులు, భర్తలు, సోదరులపై ఆధారపడుతుంటారు. అందుకే ఆర్థిక విషయాల్లో సొంతంగా తమ నిర్ణయాలు తాము తీసుకునేలా ఆడపిల్లల్ని తీర్చిదిద్దడం అవసరం. దీనికోసం ఇంట్లో జరిగే ఆర్థిక చర్చల్లో వారిని భాగం చేయాలంటున్నారు నిపుణులు. ఫలితంగా వారికి ఆర్థిక ప్రణాళిక, పన్నులు, ఖర్చులు వంటి వివరాలపై అవగాహన వస్తుంది. అలాగే ఉద్యోగం వచ్చాక కూడా పొదుపు చేసేలా, సొంతంగా చిన్న మొత్తాల్లో పెట్టుబడులు పెట్టేలా వారిని ప్రోత్సహించాలి. ఫలితంగా ఆర్థికపరమైన విషయాల్లో ఎవరిపైనా ఆధారపడకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు అని సూచిస్తున్నారు.



**డబ్బు విలువ తెలుసా?**

ఈ రోజుల్లో చాలామంది తల్లిదండ్రులు పిల్లల ఆనందం కోసం విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయడం, వారికి అడిగిందల్లా కొనివ్వడం చేస్తున్నారు. ఫలితంగా వారికి డబ్బు విలువ తెలియకుండా పోయే అవకాశం ఉంటుంది. ఇది వారి భవిష్యత్తుకు ఏమాత్రం మంచిది కాదు. కాబట్టి, పిల్లలకు చిన్నప్పటి నుంచే డబ్బు విలువ తెలిసేలా చేయాలంటున్నారు నిపుణులు. దీనికోసం వారు చేయగలిగే కొన్ని పనులను అప్పగించండి. సరిగా చేస్తే బహుమతిగా కొంత నగదు ఇవ్వండి. ఒకవేళ పనిలో నాణ్యత లేకపోతే తక్కువ డబ్బు ఇవ్వండి. దీనివల్ల డబ్బులు సులభంగా రావనే విషయం వారికి అర్థమవుతుంది. ఫలితంగా వారు డబ్బుకు విలువివ్వడం మొదలుపెడతారు.

**ఆ వ్యత్యాసాన్ని తెలియజేయండి..**

ఆశకి, అవసరానికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది. అది తెలిస్తే ఎవరైనా తమ ఖర్చులను అదుపులో పెట్టుకోవచ్చంటున్నారు నిపుణులు. తల్లిదండ్రులుగా మీ పిల్లలకు ఇదే విషయాన్ని చెప్పండి. ఇలా చేయడం వల్ల వారు చేసే ఖర్చును వారే అదుపులో పెట్టుకునే అవకాశం ఉంటుంది అంటున్నారు. దీనికోసం మీ అమ్మాయి ఏదైనా వస్తువు కొనమని అడిగితే అది తప్పనిసరిగా కావాలా? లేకపోయినా పర్లేదా? అని అడిగి నిర్ణయం తీసుకోవాలి. ఇదే పద్ధతిని క్రమంగా అలవాటు చేయడం వల్ల డబ్బు ఖర్చు చేసే విషయంలో జాగ్రత్తగా ఉండగలుగుతారు.

**చిన్నప్పటి నుంచే..!**

కొంతమంది అమ్మాయిలు ఉద్యోగం సంపాదించిన తర్వాత షాపింగ్ పేరుతో విపరీతంగా డబ్బులు ఖర్చు చేస్తుంటారు. ఇంకొంతమంది క్రెడిట్ కార్డులను ఇష్టం వచ్చినట్లు వాడేస్తుంటారు. ఇలాంటి అలవాట్లు అప్పుల ఊబిలోకి దించుతాయి. ఆర్థిక అస్థిరత్వానికి దారితీస్తాయి. కాబట్టి, పొదుపు చేయడం వల్ల కలిగే లాభాలను అమ్మాయిలకు చిన్నప్పటి నుంచే వివరించాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే పొదుపును అలవాటు చేసే కొన్ని రకాల యాప్స్ కూడా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అలాంటి వాటి గురించి కూడా వారికి తెలియచేయాలి. అలాగే కాస్త పెద్ద వయసు పిల్లల్ని చిన్న చిన్న పెట్టుబడుల దిశగా కూడా ప్రోత్సహించాలి అని సూచిస్తున్నారు నిపుణులు.

# అందుకే మనసారా నవ్వేద్దాం..

నవ్వు నాలుగు విధాల మంచిది.. అని కొందరంటే, నవ్వు నాలుగు విధాల చేటు.. అని మరికొందరంటారు. ఏదేమైనా.. ఎవరెలా అన్నా.. 'అందమైన చిరునవ్వు ముందు అన్నీ దిగదుడుపే' అనడంలో సందేహం లేదు. ఎందుకంటే మనసారా రువ్వే ఓ చిరునవ్వు ఇచ్చే అనుభూతిని, ఆత్మవిశ్వాసాన్ని మరేదీ ఇవ్వలేదు.

నవ్వు నాలుగు విధాల మంచిది.. అని కొందరంటే, నవ్వు నాలుగు విధాల చేటు.. అని మరికొందరంటారు. ఏదేమైనా.. ఎవరెలా అన్నా.. 'అందమైన చిరునవ్వు ముందు అన్నీ దిగదుడుపే' అనడంలో సందేహం లేదు. ఎందుకంటే మనసారా రువ్వే ఓ చిరునవ్వు ఇచ్చే అనుభూతిని, ఆత్మవిశ్వాసాన్ని మరేదీ ఇవ్వలేదు.

**ఆనందం.. ఆత్మవిశ్వాసం..**

మనం నిజంగా ఆనందంగా ఉన్న విషయం మన ముఖ కవళికల ద్వారా తెలిసిపోతుంది. నవ్వు మనసుకి ప్రశాంతతని, ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. మనం ఇతరులను నవ్వుతూ పలకరిస్తే వారి నుంచి జవాబు మరింత పాజిటివ్‌గా వస్తుంది. దీంతో మనలో ఆత్మవిశ్వాసం, ఆనందం మరింత రెట్టింపవుతాయి అంటున్నారు నిపుణులు.



నవ్వు మన అందాన్ని ఇనుమడింపజేయడమే కాదు.. ఆరోగ్యాన్నీ పెంపొందిస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లో అయినా సరే ఓ చిరునవ్వు నవ్వితే చాలు.. మనసుకి ప్రశాంతత చేకూరుతుంది. అలాగే మన నవ్వుతో ఎదుటివారిలోనూ పాజిటివిటీని నింపచ్చు. వింటున్నారా మరి!

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com